# రాత ప్రతులపై ఆసక్తి పెంచాలి

జేఎన్‌టీయూ: రాత ప్రతులకు సాంస్కృతిక సంపదలో విడదీయరాని బంధం ఉందని,వాటిపై విద్యార్థులకు ఆసక్తి పెంచడం అవసరమని సుప్రసిద్ధ కవి, రచయిత జయధీర్ తిరుమలరావు అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో వారసత్వ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. విద్యార్థులు, యువకుల్లో రాతప్రతులపై చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. రాతప్రతుల పరిరక్షణ విధానాలు గురించి స్ఫూర్తి క్రియేషన్స్ సంస్థ కార్యదర్శి పద్మిని రంగరాజన్ ప్రసంగించారు. ప్రాచీన కాలంలో అక్షరాలను రూపొందించుకున్నప్పటి నుంచి చర్మాలు, ఆకులు, వస్త్రాలు, లోహాలపై రాసేవారన్నారు. కాలక్రమంలో కాగితంపై, ప్రస్తుతం కంప్యూటర్‌పై రాస్తున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆధునిక ప్రాచీన రాత ప్రతులపై శ్రద్ధ తగ్గిందన్నారు. కాని వాటిలో భారతీయ సంస్కృతి, అపురూపమైన సాహిత్య ప్రక్రియలు ఎన్నో ఉన్నాయన్నారు. వీటిని అధ్యయనం చేయడానికి విశ్వవిద్యాలయాల్లో రాత ప్రతుల శాస్త్రం శాఖలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యప్రసన్న, సయ్యద్ అంకుష్ పాషా తదితరులు పాల్గొన్నారు.